క్లుప్తంగా

కుంగుతున్న గోదావరి గట్టు రోడ్డు



ధ్వంసమైన గోదావరి గట్టు రోడ్డు

నరసాపురం: పట్టణంలోని గోదావరి గట్టు రోడ్డు ధ్వంసమవుతుంది. పడవలరేవు నుంచి కొండాలమ్మ గుడి వరకూ రోడ్డుకు పలు చోట్ల గోతులు పడ్డాయి. రోడ్డు చాలాచోట్ల కుంగిపోయింది. దీంతో రోడ్డు ప్రమాదకరంగా మారింది. మార్నింగ్ వాక్ చేసే వారితో పాటు సాయంత్రం వేళల్లో గోదావరి తీరానికి విహారానికి పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తూ ఉంటారు. రోడ్డు సవ్యంగా లేకపోవడంతో ద్విచక్రవాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు రోడ్డు మరమ్మతులపై దృష్టి పెట్టడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లపైనే ఆవులు, దూడలు



తహసీల్దార్ కార్యాలయం రోడ్డుపై సంచరిస్తున్న పశువులు

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీలో రోడ్లపై పశువుల బెడద ఎక్కువగా ఉంది. రోడ్లపై ఆవులు, గేదెలు, దూడలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. దీంతో పారిశుద్ధ్య ఇబ్బందులతో పాటుగా ట్రాఫిక్ సమస్యలు కూడా ఏర్పడుతున్నాయి. కొన్ని నెలల క్రితం పట్టణంలో ఎక్కడా రోడ్లపై పశువులు, పందులు కనిపించకూడదని మున్సిపల్ అధికారులు హడావుడి చేశారు. పందులను పట్టుకోవడంతోపాటు రోడ్లపై తిరుగుతున్న పశువుల యజమానులకు నోటీసులు ఇస్తామని హెచ్చరికలు కూడా చేశారు. తర్వా ఈ విషయాన్ని మరిచిపోయారు. దీంతో రోడ్లపై విచ్చల విడిగా పశువులు సంచరించడంతో బైక్‌లు, సైకిళ్లపై వెళ్లేవారు ప్రమాదాలకు కూడా గురవుతున్నారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమే ఈ సమస్యకు కారణమనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికై నా సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

శతాధిక వృద్ధుడి మృతి



చీడే వెంకన్న (ఫైల్)

యలమంచిలి: మండలంలోని మేడపాడు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు చీడే వెంకన్న (101) గురువారం మృతి చెందారు. ఆయన మరణించే వరకు ఆరోగ్యంగా ఉండడం విశేషం. పైగా ఆయన సుమారు 80 ఏళ్లుగా పేపర్ పాఠక ప్రియుడు. 2008కి ముందు చాలా పేపర్లు చదివిన 2008లో సాక్షి పత్రిక వచ్చిన నాటి నుంచి ఆయన విడవకుండా సాక్షి పేపర్‌ను వేయించుకుంటున్నారు. ఆయన భార్య గతంలోనే మరణించగా ఇద్దరు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలు, 11 మంది మనుమలు, 13 మంది మునిమనుమలు ఉన్నారు.

ఘనంగా సీతారామ విగ్రహ పునఃప్రతిష్ఠ

ఉండి: స్థానిక సీతారామపేటలో ఉన్న కోదండ రామాలయంలో సీతా రాముల విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. పోనసానపల్లి వీరయ్య, మహలక్ష్మి దంపతులు పీటలపై కూర్చుని సీతారాముల కల్యాణం జరిపించారు.ఈ కార్యక్రమానికి హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేసారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గుండాబత్తుల సుబ్బారావు, సీపీఐ జిల్లా నాయకుడు కలివెట్టి వెంకట్రావు, సీతామపేట యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ ఉద్యోగిపై దాడి

ఉండి: పంచాయతీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగిపై దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం పాందువ్వ గ్రామంలో పంచాయతీ ట్యాంక్ వాచర్, బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న హనుమంతు కృష్ణారావు అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన ఆరివెల్లి నరసన్న అనే వ్యక్తి ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటిపన్ను విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడేందుకు వెళ్లిన నరసన్న అక్కడే విధుల్లో ఉన్న ఉద్యోగిపై దాడి చేసి విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై ఎస్సై ఎండీ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు గ్రామస్థాయి సిబ్బందికి శిక్షణ

పాలకోడేరు: ప్రకృతి విపత్తుల సమయంలో గ్రామస్థాయి సిబ్బంది ఎలా స్పందించాలనే అంశంపై ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ వి.రెడ్డియ్య తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. శిక్షణ కార్యక్రమాన్ని మూడు బ్యాచ్‌లుగా ఏర్పాటు చేశామని, సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలని స్పష్టం చేశారు.

కల్వర్టుల నిర్మాణంలో జాప్యం

ఇబ్బందులుపడుతున్న ప్రజలు

నరసాపురం రూరల్: మండలంలో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల్లో కొంత మేర అసంపూర్తిగా ఉండిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు కృషితో నరసాపురం నుంచి పెదమైనవానిలంక వరకూ 12 కిలోమీటర్ల మేర ఈ రహదారి పనుల నిర్మాణానికి రూ.22 కోట్లు మంజూరయ్యాయి. 2023వ సంవత్సరం చివరిలో ఈ పనులు ప్రారంభమయ్యాయి. అనంతరం ఎన్నికలు రావడంతో పనులు పూర్తికావవడానికి కొంత జాప్యం జరిగినప్పటికీ ఎట్టకేలకు రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. అయితే ఈ రోడ్డు నిర్మాణంలో భాగంగా ఐదు చోట్ల కల్వర్టులు నిర్మించాల్సి ఉంది.

ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా

కల్వర్టుల నిర్మించాల్సిన వేములదీవి, నల్లీక్రీక్ డ్రెయిన్లపై కల్వర్టులు కాకుండా బ్రిడ్జిలు నిర్మించాలని ఆయా ప్రాంతాల ప్రజలు, రైతులు కోరుతున్నారు. మిగిలిన మూడు చోట్ల కల్వర్టుల నిర్మాణం ఆలస్యం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పనులు పూర్తయితే పీఎంలంక, తూర్పుతాళ్లు, ఎల్బీచర్ల, సారవ, లక్ష్మణేశ్వరం తదితర గ్రామాల ప్రజానీకం ఈ రోడ్డు మార్గం గుండా ప్రయాణించడం సులభమవుతుంది. వెంటనే కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేసి ప్రజలు, ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.



పరసావారిమెరక ప్రాంతంలో అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణం



చినసారవలో కల్వర్టు ప్రాంతం వరకు అధ్వానంగా ఉన్న రోడ్డు

పనులు పూర్తి చేయాలి



రోడ్డు నిర్మాణంలో భాగంగా నిలిచిపోయిన కల్వర్టు పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలి. పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు ఉన్నప్పటికీ పనులను ఎందుకు ఆలస్యం చేస్తున్నారో? అర్థం కావడం లేదు. తక్షణమే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి.

– దొంగ మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి

త్వరలో పనులు చేపడతాం



రోడ్డు నిర్మాణంలో భాగంగా ఆలస్యమైన కల్వర్టు పనులు త్వరలోనే ప్రారంభిస్తాం. పలు కారణాలతో ఈ కల్వర్టుల నిర్మాణం కొంత ఆలస్యమైంది. త్వరలోనే పనులను చేపట్టి పూర్తి చేస్తాం. ఈ కల్వర్టు నిర్మాణం పూర్తయితే రైతాంగానికి, ప్రజానీకానికి మేలు కలుగుతుంది.

– కేటీ ప్రసన్న బాబు, ఏఈ ఆర్అండ్‌బీ, నరసాపురం

గ్రామాల్లో వైభవంగా కల్యాణోత్సవాలు



సత్యవరంలో శ్రీరామేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: మండలంలోని ఆలమూరులో ఉన్న శ్రీపార్వతీ సమేత విశ్వేశ్వరస్వామి, సత్యవరం గ్రామంలోని శ్రీఉమా రామేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. పార్వతి విశ్వేశ్వరస్వామివారి కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు రాయవరపు శ్రీసూర్యశర్మ ఆధ్వర్యంలో గ్రామ మాజీ సర్పంచ్ కొవ్వూరి సత్తిరెడ్డి పద్మావతి దంపతులు నిర్వహించగా, రామేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకుడు కొండవీటి సాయికుమార్‌శర్మ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన మిర్యాల శ్రీనివాస్, మసేనమ్మ దంపతులు నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో ఆయా గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున హాజరై మంత్రపుష్పం, దర్బారుసేవ, చతుర్వేద స్వస్తి, ఆశీర్వచన కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

రేషన్ బియ్యం స్వాధీనం



సిద్ధాంతంలో స్వాధీనం చేసుకొన్న రేషన్ బియ్యంతో విజిలెన్స్ అధికారులు

పెనుగొండ: రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వీ శ్రీరాంబాబుకు అందిన సమాచారం మేరకు సిద్ధాంతంలో నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న 35 కింటాళ్ల రేషన్ బియ్యంస్వాధీనం చేసుకొన్నట్లు విజిలెన్స్ సీఐ పి.శివరామకృష్ణ తెలిపారు. గురువారం అశోక్ లేలాండ్ వాహనంలో డ్రైవర్ కొల్లేపర మణికంత తీసుకు వెళ్తుండగా ఆపి విచారించగా తణుకు పరిసర ప్రాంతాల్లో ఎస్‌వీ రామకృష్ణ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి అధిక ధరకు నర్సాపూడికి చెందిన ఉండమట్ల మణికంతకు అమ్మినట్లు తెలిపారన్నారు. ఈ మేరకు రూ.1.40 లక్షల విలువైన బియ్యంతో పాటు, రూ.5.85 లక్షల విలువైన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిత్యావసరాల చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో పెనుగొండ సీఎస్ ఆర్ఐ సత్యనారాయణతో పాటు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కలంపై కక్ష సాధింపు తగదు

నరసాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద జర్నలిస్టుల ఆందోళన



పెనుగొండ తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

నరసాపురం: కలంపై కక్ష సాధింపులు తగవని రాజ్యాంగం హక్కుగా కల్పించిన పత్రికా స్వేచ్ఛను ప్రభుత్వం కాపాడాలని నరసాపురం నియోజకవర్గ ప్రెస్‌క్లబ్ జర్నలిస్ట్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడలోని సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి నివాసంలో సిట్ దర్యాప్తు పేరుతో పోలీసులు అక్రమ సోదాలు చేయడాన్ని నిరసిస్తూ గురువారం పట్టణంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు నరసాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, జర్నలిస్టులపై కక్షసాధింపులు చర్యలు మానుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నరసాపురం నియోజకవర్గ ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షుడు పండా నాగేంద్ర త్రినాథ్ మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా సమాజంలో ఎలాంటి చర్యలు జరిగినా తప్పేనన్నారు. ఓ పత్రికకు ఎడిటర్ స్థాయిలో ఉన్న వ్యక్తి నివాసంలో ముందస్తు నోటీసులు లేకుండా పోలీసులు సోదాలు చేయడం దారుణమన్నారు. పోలీసులు నిబంధనలు మేర వ్యవహరిస్తే ఎవరికీ ఇబ్బంది ఉండదన్నారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై పెట్టిన అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలని, అక్రమ సోదాలు వంటి చర్యలు ఇకపై జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలనా అధికారి సాయికృష్ణకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కార్యదర్శి నాయుడు మారుతీరావు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సాక్షి రంగా, అంజూరి చిన్నారావు, కోట్ల బాలకృష్ణ, సవరం కృష్ణానందం, దివి న్యూస్ వెంకట్, ఆకుల సందీప్, సత్యనారాయణ, ప్రభాకర్, పండు, కేతినీడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిపై పోలీసులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యంగా సోదాలు నిర్వహించడానికి ఖండిస్తూ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పెనుగొండ తహసీల్దారు జి.అనితకు మారికి జర్నలిస్టులు వినతి పత్రం సమర్పించారు. గురువారం సాయంత్రం జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలు ధరించి తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయవద్దంటూ వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు గుర్రాల శ్రీనివాసరావు, తేతలి తమ్మిరెడ్డి, ర్యాలీ శంకరం, రాజశేఖర్, హనుమంతు, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు



సాక్షి పత్రిక కూటమి ప్రభుత్వ కుంభకోణాలు, అవినీతిని బయటకు తీస్తుంటే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. దాడులు చేయడం, నిర్బంధంగా వ్యవహరించడం దారుణం. ఇటీవల కాలంలో జర్నలిస్టులపై దాడులు పెరిగాయి. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టువంటిది. ఇప్పటికై నా తీరు మార్చుకోవాలి

– దంపనబోయిన బాబూరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు



పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడానికి ప్రయత్నిస్తున్నారు. బెదిరింపులు, దాడులతో భయ పెట్టాలని ప్రయత్నించడం దారుణం. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా సోదాలు చేయడం ఎంతవరకూ సబబు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలగకుండా ప్రభుత్వం వ్యవహరించాలి.

– పాలసత్తి రామిరెడ్డి(రాజా), యువజన సంఘనాయకులు

పదో తరగతి విజేతలకు అభినందనలు



విజేతను సత్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

యలమంచిలి: యూటీఎఫ్ ఉపాధ్యాయులు గురువారం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను నేరుగా కలుసుకుని అభినందించారు. ఇటీవల వచ్చిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల స్థాయిలో మొదటి ఐదు ర్యాంకులు సాధించిన విద్యార్థులు వరుసగా శూల హరి రామచరణ్ (ఏనుగువానిలంక హైస్కూల్), శీర్ల జానుశ్రీ (మట్లపాలెం), ముళ్ళపూడి సిరిదీపిక (దొడ్డిపట్ల), మెడవల శ్రీహన్సిక (మేడపాడు) రాయుడు కీర్తన (ఇలపకుర్రు)లను వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, బంధువుల సమక్షంలో ప్రశంసా పత్రం, జ్ఞాపిక, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ విధంగా చేయడం వలన విద్యార్థుల్లో నూతన ఉత్సాహం వచ్చి మరింత బాగా చదవడానికి ప్రయత్నిస్తారని ఈ కార్యక్రమం చేపట్టినట్లు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏకేవీ రామభద్రం తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి పోలిశెట్టి క్రాంతి కుమార్, సీనియర్ నాయకులు ఎస్ఎస్‌వీ అవధాని, రామేశ్వరపు సత్యనారాయణ, మందా ఉమ, మండల శాఖ అధ్యక్షుడు గుత్తిందివి శ్రీనివాసరావు ప్రధాన కార్యదర్శి పంతం రామమూర్తినాయుడు పాల్గొన్నారు.

ఎండ వేడిమితో సభ్యులు సతమతం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు



సమావేశంలో ఖాళీగా ఉన్న సభ్యుల కుర్చీలు

యలమంచిలి: ఒక వైపు ఎండ వేడిమి..మరొక వైపు సక్రమంగా తిరగని ఫ్యాన్లు..దీంతో ఉక్కబోతకు తట్టుకోలేక ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సమావేశం మధ్యలోనే వెళ్లిపోవడంతో యలమంచిలి మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ ఎన్నిక వివాదాల నేపథ్యంలో గత సమావేశం అర్థాంతరంగా రద్దు కావడంతో ఈసారైన ప్రజా సమస్యలపై చర్చ జరుగుతుందేమో? అనుకున్న తరుణంలో ఉక్కపోతకు తట్టుకోలేక సభ్యులంతా సంతకాలు చేసి వెళ్లిపోయారు. కనీసం అధికారులు సమావేశ మందిరంలోని ఫ్యాన్లు కూడా మరమ్మతులు చేయించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో వేసవి సమస్యలపై చర్చ లేకుండానే సమావేశం ముగిసింది. ఉన్న కొద్దిపాటి సభ్యులకు శాఖల వారీగా తమ శాఖల పరిధిలో జరుగుతున్న పనుల వివరాలను అధికారులు చెప్పి సమావేశం ముగించారు.

రోడ్డుకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలి

మండలంలోని అన్ని గ్రామాలలో కొత్తగా సిమెంట్ రోడ్డులు వేస్తున్న నేపథ్యంలో రోడ్డుకు అడ్డుగా ఉంటున్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు కోరారు. విద్యుత్ స్తంభాల మార్పునకు విద్యుత్ శాఖ అధికారులు డబ్బులు కట్టమని చెప్పడంతో ఎస్టిమేట్స్‌లో అందుకు నిధులు లేకపోవడంతో విద్యుత్ స్తంభాలు రోడ్డు మధ్యలో ఉంచి రోడ్డు వేస్తున్నారని, దీని వల్ల భవిష్యత్తులో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున విద్యుత్ శాఖ అధికారులే స్తంభాలను తొలగించాలని ఎంపీపీ కోరారు.

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయడమే కాకుండా కార్డులో మార్పులు, చేర్పులు, తొలగింపులకు అవకాశం వచ్చిందని తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొప్పాడి శ్రీనుబాబు, ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న కల్యాణం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక కొత్త బస్టాండ్ వద్ద ఉన్న శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా గ్రంధి బాలాజీ, గౌతమి సంవర్ధిని దంపతుల చేతుల మీదుగా స్వామివారి కల్యాణం చేశారు.

మానవ అక్రమ రవాణాను నిరోధించాలి

పాలకోడేరు: మానవ అక్రమ రవాణాను నిరోధించడం అందరి బాధ్యత అని విస్సాకోడేరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ లక్ష్మీకాంతం స్పష్టం చేశారు. హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం విస్సాకోడేరు సీడీపీఓ కార్యాలయంలో మానవ అక్రమ రవాణా నిరోధంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా లక్ష్మీకాంతం మాట్లాడుతూ 1930 టోల్ ఫ్రీ నంబర్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజ్వల ఎన్జీఓ కోఆర్డినేటర్ శ్రావ్య శృతి, సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, అనిల్ కుమార్, చెన్నకేశవులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ పాలకొల్లు బ్రాంచి వారు నాకిచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది ఏమనగా ఈ క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిని శ్రీ మేడపాటి బులిరెడ్డి తండ్రి దినసుబ్బిరెడ్డి, మేడపాటి శ్రీనివాసరెడ్డి తండ్రి బాపిరెడ్డి మార్టుగేజ్ చేయడానికి అంగీకరించారు. సదరు ఆస్తిపై ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నా ఈ ప్రకటన వెలువడిన వారం రోజులలో తెలియజేయవలెను. తరువాత వచ్చిన అభ్యంతరములు స్వీకరించ బడవు. వీరవాసరం సబ్ రిజిస్ట్రార్ డాక్యుమెంట్ నం.555/2018, పాలకోడేరు మండలం పెన్నాడ గ్రామం ఆర్.యస్.నెం.235 /1 లో ఉన్న 442 చ.గ స్థలానికి హద్దులు: తూర్పు: [illegible], పడమర: రోడ్డు, ఉత్తరం: [illegible] స్థలం, దక్షిణం: [illegible] నారాయణ స్థలం.

పి.ఎల్.యస్.ప్రసాద్, బి.కాం.,బి.ఎల్., అడ్వకేట్, రాజమండ్రి సెల్ : 98495 87025

ప్రకటన

నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ పాలకొల్లు బ్రాంచి వారు నాకిచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది ఏమనగా ఈ క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిని శ్రీ పిల్లి నాగూరు తండ్రి వనమయ్య మార్టుగేజ్ చేయడానికి అంగీకరించారు. సదరు ఆస్తిపై ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నా ఈ ప్రకటన వెలువడిన వారం రోజులలో తెలియజేయవలెను. తరువాత వచ్చిన అభ్యంతరములు స్వీకరించ బడవు. నరసాపురం సబ్ రిజిస్ట్రార్ డాక్యుమెంట్ నం. 1929/1982, నరసాపురం మండలం [illegible] గ్రామం ఆర్.యస్.నెం. 334/5 లో ఉన్న 3 1/8 సెంట్లు స్థలానికి హద్దులు: తూర్పు: [illegible] భూమి, పడమర: [illegible] కృష్ణమూర్తి భూమి, ఉత్తరం: [illegible] భూమి, దక్షిణం: రోడ్డు.

పి.డి.యస్.వి.బాలాజీ, బి.కాం.,బి.ఎల్., అడ్వకేటు, పాలకొల్లు, సెల్ : 94904 38732

పశుగ్రాసానికి గడ్డు కాలం

పెనుగొండ: అకాల వర్షాలకు పొలాల్లోని ఎండుగడ్డి పశుగ్రాసానికి పనికి రాకుండా పోయిందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వరి కోతలు జరుగుతుండగా అకాల వర్షంతో వరి గడ్డి మొత్తం వర్షార్పణం అయింది. దీంతో రానున్న రోజుల్లో పశుగ్రాస కొరత తప్పదంటూ పాడి రైతులు ఆవేదన చెందుతున్నారు. అసలే ఇటీవల పెరిగిన యంత్రాలతో వరికోతలు జరుగుతండడంతో గడ్డి కొరత ప్రతి ఏటా ఎదురవుతుంది. దీంతో గడ్డి ధరలు ఆకాశాన్ని అంటాయి. కొద్దిపాటిగా లభించే గడ్డితో పాడిరైతులు కాలం గడుపుకుంటూ వస్తున్నారు. అయితే కోతలు ముమ్మరంగా ఉన్న తరుణంలో శనివారం, ఆదివారాల్లో కురిసిన భారీ వర్షాలతో కోతలు పూర్తయిన ప్రాంతాల్లో వరి గడ్డి చేలల్లోని ఉండిపోయింది. దీంతో గడ్డి సేకరించే అవకాశం లేకుండాపోయింది.

అదనపు ఖర్చుతో కుదేలు

వర్షాలు రాక ముందు కోతలు పూర్తయిన అనంతరం గడ్డి చుట్టే యంత్రాలతో గడ్డి చుట్టలు చుటించే వారు. ఒక్కో గడ్డి చుట్టకు చుట్టడానికి యంత్ర నిర్వాహకులు రూ.30 వరకూ ధర తీసుకునే వారు. దీంతో ఎకరం గడ్డి వరిచేలో రూ.3 వేల వరకూ ఖర్చయ్యేది. మరో రెండు మూడు వేలు రూపాయలతో పశువుల మకాంకు చేర్చుకునేవారు. గతంలో ఇదే గడ్డి రూ. 3 వేలతో ఎకరం గడ్డి లభించేది. వరి కోత యంత్రాలు వచ్చిన తరువాత గడ్డి లభ్యత తగ్గిపోవడంతో రూ.6 వేల వరకూ ఖర్చు పెట్టాల్సి వచ్చింది. ఇప్పుడు ఆ పరిస్థితి సైతం లేకుండా పోయింది. వర్షంతో గడ్డి కొరత విపరీతంగా ఏర్పడింది. ఎక్కడ గడ్డి అక్కడే ఉండిపోయి, చీకిపోవడం ప్రారంభమైంది. కొందరు పాడి రైతులు మాత్రం వ్యయ ప్రయాసలతో గడ్డిని తెచ్చుకుని మేట్లు వేసుకుని పశుగ్రాస కొరత నుంచి బయట పడడానికి ప్రయత్నిస్తున్నారు. గడ్డి చుట్ల మేట్లు వేసి బరకాలు కప్పి గడ్డిని రక్షించుకుందామనుకున్న వారిని ఈదురుగాలులు నిరాశపరచాయి. ఈదురు గాలులలకు ఎండుగడ్డి పాడైపోయింది. దీంతో పశుగ్రాస కొరతను ఎదుర్కోడానికి పాడి రైతులు ప్రత్యామ్నాయాలు వెతుక్కోవడం ప్రారంభించారు.

టీఎంఆర్ పశుగ్రాసం పంపిణీ చేయాలి

పాడి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం టీఎంఆర్ పశుగ్రాసాన్ని ఉచితంగా అందించడానికి ఏర్పాట్లు చేయాలని పాడి రైతులు కోరుకొంటున్నారు. గతంలో టీఎంఆర్ పశుగ్రాసం సబ్సీడీపై పంపిణీ చేసినా, ఇటీవల కాలంలో నిలిచిపోవడంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాడిరైతులకు అండగా పలువురు కోరుతున్నారు.



వరి చేలల్లోనే పనికి రాకుండా పోయిన వరి గడ్డి



గడ్డిని కాపాడుకోవడానికి బరకాలు కప్పిన దృశ్యం